





జిల్లాకు మళ్లీ మొండిచెయ్యే!

- కేంద్రబడ్జెట్‌లో జిల్లాలోని ప్రాజెక్ట్‌లకు దక్కని కేటాయింపులు
- పెండింగ్ ప్రాజెక్ట్‌ల ఊసెత్తని కేంద్రం
- రైల్వేకు కేటాయించిన బడ్జెట్‌లో డబుల్‌లైన్, కొత్త లైన్లకు నిధులు వచ్చేనా?
- బడ్జెట్‌లో తెలంగాణను మోదీ సర్కారు విస్మరించిందంటున్న కాంగ్రెస్
- సామాన్యుడికి ఉపయోగపడని బడ్జెట్ అంటున్న ప్రతిపక్షాలు
- అన్నివర్గాలకు ఆమోదయోగ్యంగా ఉందంటున్న బీజేపీ

కామారెడ్డి, జూలై23 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేంద్రబడ్జెట్ జిల్లా ప్రజలను నిరాశపరిచింది. కేంద్రఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్ రూ.48.21 లక్షల కోట్ల బడ్జెట్‌ను పార్లమెంట్‌లో మంగళవారం ప్రవేశపెట్టగా ఈ బడ్జెట్‌లో జిల్లాకు మరోసారి మొండిచెయ్యే చూపారు. గతంతో పోలిస్తే ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి బీజేపీకి ఆశించిన మేర ఎంపీ సీట్లు దక్కడంతో ఈ బడ్జెట్‌లో తెలంగాణకు నిధుల వరద కురిపిస్తుందని అంతా ఆశించినప్పటికి మరోసారి రాష్ట్రంపై మోదీ సర్కార్ వివక్ష చూపించారంటూ ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు మండిపడుతున్నాయి. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యుడికి ఉపయోగపడేలా లేదని తెలంగాణ రాష్ట్రాన్ని కేంద్రం విస్మరించిందని కాంగ్రెస్ విమర్శించింది. అదేవిధంగా కేంద్రఆర్థికశాఖమంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్నివర్గాల ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉందని వ్యవసాయ, నిరుద్యోగయువత గ్రామీణ, పట్టణాభివృద్దే ధ్యేయంగా బడ్జెట్ ఉందని బీజేపీ అభిప్రాయం వ్యక్తంచేస్తోంది. ఉచితాలకు తావివకుండా పేదవర్గాలకు ఉపయోగకరంగా ఉండేపథకాలకు బడ్జెట్‌లో ప్రాధాన్యత కల్పించారని బీజేపీ నేతలు హర్షంవ్యక్తం చేస్తున్నారు.

• జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్ట్‌ల ఊసేలేదు

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో యేండ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్ట్‌లకు, జాతీయరహదారుల నిర్మాణానికి కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆయా శాఖలకు కేటాయించిన నిధుల నుంచి కేటాయింపులు వస్తాయో లేవో చూడాలి. మహారాష్ట్రలోని ముత్కెడ్ నుంచి నిజామాబాద్ హైదరాబాద్ వరకు డబుల్‌రైల్వే లైన్ ఏర్పాటుకు గత 8నెలల కిందటే కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే ఈ పనులకు కేంద్ర రైల్వేశాఖ నిధుల ఖర్చు ప్రతిపాదనలు చేసింది. ఈ నేపథ్యంలో కేంద్ర బడ్జెట్‌లో రైల్వేశాఖకు లక్షల కోట్ల నిధులను కేటాయించారు. ఈ నిధులోంచి డబుల్‌లైన్‌కు ఎన్నినిధులు కేటాయిస్తారో చూడాలి. అలాగే బోధన్-బాన్సువాడ-బీదర్ కొత్త రైల్వేలైన్‌కు ఆమోదం లభించినపనుల కోసం నిధులు కేటాయించలేదు. సర్వే పూర్తి చేసి పనులను చేపట్టేందుకు రైల్వేశాఖకు కేటాయించిన నిధుల్లో ఎంతమేర వస్తాయో చూడాలి. ఇక కరీంనగర్, కామారెడ్డి, పిట్లం వరకు జాతీయరహదారి నిర్మాణానికి సైతం ఈబడ్జెట్ నిధులు కేటాయించాల్సి ఉంటుంది. కేంద్రరోడ్డు రవాణాశాఖకు లక్షలకోట్ల నిధులను కేటాయించారు. ఈబడ్జెట్‌లోనూ ఈ శాఖనుంచి కేకేవై జాతీయరహదారి నిర్మాణానికి కేటాయింపులు జరుగుతాయా చూడాలి. వ్యవసాయరంగానికి రూ.1.52లక్షల కోట్లలో కేటాయించారు. వచ్చే రెండేళ్లలో కోటిమంది రైతులు ప్రకృతిసేద్యాన్ని చేసేలా ప్రోత్సహించడానికి 400జిల్లాలో డిజిటల్ క్రాప్ సర్వేలను నిర్వహించడానికి, ఐదురాష్ట్రాల్లో కిసాన్‌కార్డులను అందించనున్నారు. గ్రామీణాభివృద్ది శాఖకు రూ.2.66లక్షల కోట్లు కేటాయించారు.

• 9 అంశాలకే అధిక ప్రాధాన్యత

ఈ బడ్జెట్ 9 అంశాలకు కేంద్రం అత్యంత ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలుస్తోంది. వ్యవసాయంలో ఉత్పదక పెంపు, ఉద్యోగ కల్పన, నైపుణ్యాల పెంపు, మానవ అభివృద్ధి, సామాజికన్యాయం, గ్రామీణ పట్టణ అభివృద్ధి, మౌలిక వసతులను అత్యధిక ప్రాధాన్యతను ఇచ్చింది. ముద్రలోన్ పరిమితిని కేంద్రం భారీగా పెంచింది. ఇప్పటివరకు ఈస్కీం కింద రూ.10లక్షల లోన్ ఇస్తుండగా ఆ పరిమితిని రూ.20 లక్షలకు పెంచుతూ ప్రకటించారు. వాణిజ్యబ్యాంకులు, స్మాల్‌ఫైనాన్స్ బ్యాంకులో ఈ లోన్‌ల లభించనుంది. యువతకోసం ఐదుపథకాలతో పీఎం ప్యాకేజీని ప్రవేశపెట్టింది. విద్యార్థులు చదువు కోసం మోడల్ స్కూల్ రుణపథకంలో మార్పులు తీసుకువచ్చింది. దీని ద్వారా ప్రతీ ఏడాది 25వేల మంది విద్యార్థులకు సహాయం అందనుంది. స్వదేశీ విద్యాసంస్థల్లో ఉన్నతవిద్యకోసం రూ.10లక్షల వరకు రుణం విద్యార్థులు తీసుకోవచ్చు.

• పన్ను మినహాయింపు పరిమితి పెంచని కేంద్రం

కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సామాన్యుడికి ఊరటనిచ్చేలా ఆదాయ పన్ను మినహాయింపు ప్రకటిస్తారని అంతా భావించారు. ఈబడ్జెట్‌లో ఆదాయ పన్ను 10లక్షల వరకు మినహాయింపు ఇస్తారని మధ్యతరగతి ప్రజలు ఆశించారు. కానీ ఆదాయ పన్నుపై బడ్జెట్‌లో ఎలాంటి ప్రకటనా చేయలేదు. పాత ఆదాయ పన్ను విధానాన్ని కేంద్రం కొనసాగించనుంది. దీంతో ప్రజలు కాస్త నిరాశకు గురయ్యారు.

మైనార్టీలు, దళితులను పట్టించుకోలేదు కేంద్రం



• షబ్బీర్‌అలీ, ప్రభుత్వ సలహాదారుడు

దేశంలో మైనార్టీలు, దళితులు, మహిళలు తమ భద్రతపై ఆందోళన చెందుతున్నారు. వారి భద్రతపై కేంద్రం ఊసేఎత్తలేదు. బీహర్, ఆంధ్రకు ప్రకటించిన దాంట్లో తెలంగాణకు 25శాతం కూడా నిధులు ఇవ్వలేదు. మోదీ ప్రభుత్వం ఆర్భాటంగా పథకాలను తీసుకువస్తున్నామని ప్రకటిస్తున్నా వాటి అమలుపై శ్రద్ధ లేదు. నిధులు కేటాయించాలని సీఎం, మంత్రులు మూడుసార్లు ఢిల్లీకి వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రమంత్రులను కలిసినా పట్టించుకోలేదు. ధరల మంటను నియ ంత్రించేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.

అందరికీ ఆమోదయోగ్యంగా..



• వెంకటరమణా రెడ్డి, ఎమ్మెల్యే, కామారెడ్డి

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అందరికీ ఆమోదయోగ్యంగా ఉంది. అన్నివర్గాలకు మేలు చేకుర్చేలా బీజేపీ ప్రభుత్వం బడ్జెట్‌ను రూపొందించింది. ఉచితాలకు తావివకుండా ప్రతీ సామాన్యుడు, మధ్యతరగతి ప్రజలకు అమలు చేస్తున్న పథకాలకు కేటాయింపులు బడ్జెట్‌లో ఎక్కువగానే చేశారు. అభివృద్ధి పనులకు సైతం లక్షల కోట్ల నిధులు ప్రతిపాదించారు.

తెలంగాణను మరోసారి విస్మరించారు



• ముజిబోద్దిన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు,కామారెడ్డి

బడ్జెట్‌లో కేటాయింపుల్లో తెలంగాణకు మరోసారి విస్మరించారు. తెలంగాణలోని పలు ప్రధాన ప్రాజెక్ట్‌లే కాకుండా జిల్లాలోని రైల్వే లైన్లకు ఈబడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. బడుగు, బలహీన వర్గాలకు ఈ బడ్జెట్ అనుకులంగా లేదు. వ్యవసాయ, వైద్యరంగానికి బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వలేదు. ఇది అన్ని వర్గాల ప్రజలకు లబ్ధిచేకురేలా లేదు.

జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టుల ఊసేలేదు..



• కైలాస్ శ్రీనివాస్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ మరోసారి నిరాశపరిచింది. రాష్ట్రంలో బీజేపీ 8 ఎంపీ సీట్లను సాధించడంతో తెలంగాణకు కామారెడ్డి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రైల్వే జాతీయ రహదారుల ప్రాజెక్టులకు నిధులు కేటాయిస్తుందని ఆశించాం. కానీ కేంద్ర బడ్జెట్‌లో జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టుల ఊసే ఎత్తలేదు.

ప్రజా వ్యతిరేక బడ్జెట్



• వెంకట్‌గౌడ్, సీపీఎం జిల్లాకార్యదర్శి

బడ్జెట్ ప్రజా వ్యతిరేకంగా ఉంది. దేశంలో ఉన్న రైతులను, మధ్యతరగతి ప్రజలను, సామాన్యులను, వ్యవసాయ కూలీలను, కార్మికులను కడుపుకొట్టి కార్పొరేట్లకు దోచిపెట్టే బడ్జెట్. కేవలం కార్పొరేట్లను సంతృప్తి పరచడం కోసమే కేంద్రం బడ్జెట్‌లను ప్రవేశపెట్టినట్లు ఉంది. నిత్యవసర ధరలను తగ్గించడంలో కేంద్రం బడ్జెట్ రూపొందించలేదు.

ఉద్యోగులను నిరాశపరిచింది

• అనిల్, టీపీటీఎఫ్ ప్రధానకార్యదర్శి

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రభుత్వ ఉద్యోగులను తీవ్రంగా నిరాశకు గురిచేసింది. బడ్జెట్ ఉద్యోగులకు బిగ్ షాక్‌నే ఇచ్చింది. ట్యాక్స్, స్లాబ్‌రేట్‌లో పాత పద్ధతిని అమలు చేస్తూ ఎలాంటి మార్పుచేయకపోవడం, ఉద్యోగవర్గాలను తీవ్రంగా నిరాశ కల్పించింది. పాతపెన్షన్ విదానంపై ఉద్యోగులకు ఊరట కలిగించే అంశాలు లేవు.



- వినియోగదారుల కనెక్షన్ వివరాలు సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేస్తున్న అధికారులు
- ఆగస్టు నుంచి బిల్లులోని క్యూఆర్ ద్వారా చెల్లింపులకు అవకాశం?



త్వరలో విద్యుత్ బిల్లులపై క్యూఆర్ కోడ్

మద్నూర్, జూలై 23: వచ్చే నెల నుంచి కరెంట్ బిల్లుల చెల్లింపునకు క్యూర్ విధానం అమలులోకి రానుంది. ఇందు కోసం ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని అన్ని వినియోగదారుల కనెక్షన్ వివరాలు, ఫోన్ నెంబర్ వంటివి సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేస్తున్నారు. ఆగస్టు నెల నుంచి మీటర్ రీడర్లు రీడింగ్ తీసే సమయంలో వినియోగదారుల వివరాలు, మీటర్ యూఎస్‌సీ నెంబర్, సర్వీస్ నెంబర్, సర్వీస్ బిల్లు వివరాలను క్యూ ఆర్ కోడ్‌లో ముద్రించి బిల్లును అందించనున్నారు. వినియోగదారుడు ఈ క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేస్తే చాలు నేరుగా బిల్లు చెల్లించడానికి అవకాశం ఉంటుంది. సాఫ్టవేర్ అప్‌డేట్ చేసిన తర్వాత వచ్చే నెల నుంచి విద్యుత్ బిల్లులో క్యూర్ ఆర్ కోడ్ విధానం వస్తుందని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. విద్యుత్ బిల్లులు ఆన్‌లైన్‌లో వివిధ యాప్‌ల ద్వారా చెల్లించడం కుదరదని భారత రిజ ర్వు బ్యాంకు నిబంధన విధించింది. దీంతో విద్యుత్ అధికా రులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యుత్ సంస్థలకు సంబంధించిన సైట్లు, యాప్‌ల ద్వారా నేరుగా బిల్లు లు చెల్లించాలని పేర్కొంటున్నారు. వాస్తవానికి ఈ విధానం చాలా రోజుల నుంచి మనుగడలో ఉంది. కాని వినియో గదారులు మాత్రం ఇతర యాప్ ద్వారా బిల్లులు చెల్లిస్తు న్నారు. ఈ ప్రక్రియను మరింత సులభతరం చేయడానికి టీజీఎస్పీ డీసీఎల్ వారు విద్యుత్ బిల్లులపై క్యూఆర్‌కోడ్ ముద్రించనున్నారు. ఈ విధానం వచ్చే నెల నుంచి అందు బాటులోకి రానుంది. అందుకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ లను కార్పొరేట్ కార్యాలయాల్లో సిద్ధం చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. సాఫ్ట్‌వేర్‌ను వచ్చే నెల నుంచి అన్ని వీఆర్‌వో కార్యాలయాలకు పంపించనున్నారు.

• ప్రస్తుతానికి రెండు విధానాల ద్వారా..

తాజాగా విద్యుత్ సంస్థలు థర్డ్ పార్టీ యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లింపులు నిలిపివేయడంతో వినియోగదారులు టీజీఎస్పీ డీసీఎల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఈ యాప్‌లో బిల్లులు చెల్లింపులు, ఫిర్యాదులు, బిల్లింగ్ హిస్టరీ, సెల్ఫ్ రీడింగ్, అధికారిని సంప్రదించడానికి అవకాశం ఉంది. పే బిల్స్‌లోకి వెళ్లి యూఎస్‌సీ నెంబర్ నమోదు చేసిన తర్వాత డెబిట్, క్రెడిట్ కార్డులు యూపీఐ వాలెట్ల నుంచి బిల్లులు చెల్లించవచ్చు.



చిన్నబోయిన కోడిగుడ్డు

- జిల్లాలోని అంగన్‌వాడీలకు చిన్న సైజు గుడ్ల సరఫరా
- కొన్నింటిలో నిండుకున్న సరుకులు
- అధికారుల పర్యవేక్షణ కరువు

కాంట్రాక్టర్ల కక్కుర్తి, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా గుడ్డు చిన్న బోతోంది. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు గర్భిణీలకు గుడ్లు, పాలు పోషకాహారం అందిస్తోంది. అయితే కేంద్రాలకు సరుకులు సరఫరా చేసే కాంట్రాక్టర్లు మాత్రం నాణ్యతను విస్మరిస్తున్నారు. అంతేకాకుండా సమయానికి సరుకులు సరఫరా చేయడం లేదు. ఫలితంగా అంగన్‌వాడీలో పౌష్టికాహారం అందని ద్రాక్షలా మారింది.

ఎల్లారెడ్డి, జూలై 23: జిల్లాలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, దోమకొండ, మద్నూర్, ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో 1193 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 56,500 మంది చిన్నారులు ఉన్నారు. వీటి ద్వారా చిన్నారులు గర్భిణీలకు భోజనం, పౌష్టికాహారం నిరంతరంగా అందించాల్సి ఉంటుంది. అయితే కొన్ని సెంటర్లలో చిన్న సైజు గుడ్లు సరఫరా చేస్తున్నారు. చాలా వాటిలో పాలు, పప్పులు అందడం లేదు. ఫలితంగా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందడం లేదు. పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు అటువైపు తొంగిచూసిన పాపాన పోలేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

• 25 గ్రాముల కోడిగుడ్డు?

అంగన్‌వాడీ సెంటర్లకు 50 గ్రాముల కోడిగుడ్లను సరఫరా చేయాల్సి ఉండగా కేవలం 25 నుంచి 30 గ్రాములు ఉన్న కోడిగుడ్లను సరఫరా చేస్తున్నారు. ఒక్కో కోడి గుడ్డు మార్కెట్‌లో ఏడు రూపాయల ధర పలుకుతుండగా అంగన్‌వాడీ కేంద్రాలలో సరఫరా చేసే కోడి గుడ్డు సుమారు మూడు రూపాయల చొప్పున కోళ్ళ ఫామ్‌లో లభిస్తున్నట్లు తెలిసింది. కాగా సదరు కాంట్రాక్టర్ చిన్న పాటి గుడ్లను ఇచ్చి బిల్లు మాత్రం సాధారణ గుడ్డు పంపిణీ చేసినట్లు డ్రా చేసుకుంటున్నారు. ఇదంతా సంబంధిత ఉన్నతాధికారులకు తెలిసే జరుగుతున్నట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

• అరకొరగా సరుకులు

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 3 నుంచి ఆరేళ్ల పిల్లలకు రోజుకు ఒక కోడిగుడ్డుతోపాటు భోజనం, సాయంత్రం స్నాక్స్ ఇవ్వాలి. అలాగే గర్భిణీలు, బాలింతలకు పాలు, గుడ్డు బుధవారం రెండు ఉడకబెట్టిన గుడ్లతోపాటు నిత్యం ఆకు కాయగూరలతోపాటు భోజనం పెట్టాలి. అయితే సెంటర్లకు మాత్రం నాణ్యతలేని సరుకులు అందజేస్తున్నారు. అవికూడా అయిపోయి రోజులు గడిచిన సరఫరా చేయడం లేదు. రోజుల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

చర్యలు తీసుకుంటాం

• బావయ్య, డీడబ్ల్యూవో, కామారెడ్డి

అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన సరుకులు మాత్రమే తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చాం. చిన్న సైజు గుడ్లను తీసుకోవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే గుడ్లు 45 నుంచి 50 గ్రాములు ఉండాలి. అంతకన్నా తక్కువ బరువుతో ఉంటే సదరు నిర్వాహకులపై కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటాం.

విధుల్లో అలసత్వం వద్దు

- గాంధారిలో కలెక్టర్ సుడిగాలి పర్యటన
- డివైడర్లకు మధ్యలో మొక్కలు నాటాలని ఆదేశం
- పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ

గాంధారి, జూలై23: విధుల్లో నిర్లక్ష్యం వద్దని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను హెచ్చరించారు. గాంధారి మండలంలో మంగళవారం కలెక్టర్ పర్యటించారు. ఈ సంద ర్భంగా మండల సమైక్య ఆధ్వర్యంలో నడుస్తున్న కుట్టుమిషన్‌ను సందర్శించి అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. పారిశుధ్య పనులను ఏ విధంగా ఉన్నాయని పరిశీలించి పరిశుభ్రత పాటించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు విధులలో అలసత్వం వదలాలని సూచించారు. ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో శానిటేషన్ పరిశీలించి బస్టాండ్ యొక్క పరిస్థితిని చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. బస్టాండ్‌లో మురికినీరు ఆగడంపై డీఎం, పంచాయతీ కార్యదర్శికి శానిటేషన్ పనులు చేయించాలని తెలిపారు. గాంధారి మండల కేంద్రంలోని డివైడర్‌లోని మధ్యలో మొక్కలను పెట్టాలని తెలిపారు. మార్కండేయగుడి ప్రాంగణంలో కలెక్టర్ మొక్కలను నాటారు. చిన్నగుజ్జుతండా వెళ్లే రహదారికి వంతెన ఇటీవల కుకోతకు గురవడంతో కలెక్టర్ పరిశీలించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనంచేశారు. హాస్టల్‌లో ఉన్న పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గాంధారి పంచాయతీ కార్యాలయంలో పాఠశాలకు సంబం ధించిన యూనిఫాంల స్టీచింగ్‌ను పరిశీలించారు. గాం ధారి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భో జనాన్ని తనిఖీచేసి పాఠశాలలను పరిశీలించారు. ప్రతీ ప్రభుత్వ ఉద్యోగులు సమయపాలన పాటించి విధులు నిర్వహించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్‌రెడ్డి, ఎంపీడీఓ రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

ప్రమాదాల నివారణకు తగిన చర్యలు

కామారెడ్డిటౌన్: రోడ్డుప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కామారెడ్డి కలెక్టరేట్‌లో రోడ్ సెఫ్టీపై అధికారులతో మాట్లాడారు. ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. సమావేశంలో ఎస్పీ సింధూశర్మ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఆమ్‌ఆద్మీ ప్రజా సమస్యలపై నిత్యం పోరాడుతుంది

బోధన్‌రూరల్,జూలై23: ఆమ్‌ఆద్మీ పార్టీ ప్రజా సమస్యలపై నిత్యం పోరాడుతుందని ఆమ్‌ఆద్మీ పార్టీ బోధన్ కన్వీనర్ జునేద్ హైమద్ కలీం అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని 1వ వార్డు ఆచన్‌పల్లిలో ఆమ్‌ఆద్మీ చేరికల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆమ్‌ఆద్మీ పార్టీ తెలంగాణలో పుంజుకుంటుందని వచ్చే సంస్థాగత ఎన్నికలలో పోటీ చేస్తుందన్నారు. ప్రజలు ఆమ్‌ఆద్మీ పార్టీని ఆదరించాలన్నారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

పశువుల పాకనా..? జనరల్ ఫంక్షన్ హాలా..?



ఫంక్షన్ హాల్‌లో మేకల దృశ్యం

మోస్రా,జూలై23: మండల కేంద్రంలో పేదలకు ఆసరాగా ఉంటుందని పెళ్లి, చిన్న, పెద్ద శుభకార్యాలు చేసుకునేందుకు వీలుగా ఉండాలని నిర్మించిన జనరల్ ఫంక్షన్ హాల్ అసంపూర్ణంగా మిగిలి పనులు ఆగిపోతే ఎలా ఉంటుందనే దానికి నిదర్శనమే ఈ మోస్రాలోని జనరల్ ఫంక్షన్ హాల్ ఇక్కడ ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోగా కొన్నాళ్లు మందు బాబులకు, సిగరేట్, గంజాయి వంటి మత్తు పదార్థాలు స్వీకరించే వారికి అడ్డాగా ఏర్పడగా నేడు పశువులకు పాకగా ఉపయోగించి ఈ నిర్మాణం వృథానే అన్నట్లు గుర్తు చేసుకున్నారు. కొందరు సంబంధిత అధికారులు విచారణ చేసి సంపూర్ణంగా పూర్తి చేసి ఇవ్వాలని మండల ప్రజలు స్థానికులు కోరుతున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి

ముప్కాల్, జూలై23: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీజేపీ కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు పుప్పాల శివరాజ్ అన్నారు. మంగళవారం ముప్కాల్ మండల కేంద్రంలో బీజేపీ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ఎత్తిచూపి బీజేపీ గెలుపు కోసం కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్; బీజేపీ మండల అధ్యక్షుడు సంతోష్, నర్సయ్య, దినేష్, తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్: స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ విజయం సాధిస్తోందని ఆ దిశగా పార్టీ కార్యకర్తలు, నాయకులు సిద్ధంగా ఉండాలని మండల బీజేపీ అధ్యక్షుడు పుప్పాల నరేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బోగ దేవేం ధర్, గడ్డం రాములు, లింగాల రాముగౌడ్, వాల్గొట్ శేఖర్, మురళీగౌడ్, మోహన్, ప్రకాష్ రమేష్, బోబిడె మోహన్, ర్యాడ మోహన్‌లు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయకుంటే ఉద్యమాలు చేస్తాం

ఏర్గట్ల, జూలై 23: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే ప్రజల పక్షాన ఉద్యమాలు చేస్తామని బీజేపీ జిల్లా అధికారి ప్రతినిధి కలిగోట గంగాధర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బీజేపీకార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, ప్రతీమహిళకు రూ.2500, 500లకు సిలిండర్, పండించిన పంటలకు క్వింటాలుకు రూ.500 బోనస్, నిరుద్యోగ భృతి, కౌలు రైతులకు రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో మండలాధ్యక్షుడు నారాయణ రెడ్డి, మాజీ సర్పంచ్ సోమ రాజారెడ్డి, మాజీ ఎంపిటీసి బొల్లి శంకర్, బద్ధం సురేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డబ్బులు డిమాండ్ చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి

బోధన్‌రూరల్,జూలై23: బోధన్ మండలంలోని పెగడాపల్లి రోడ్డులో గల ఇండియన్ పెట్రోల్ బంక్ డీలర్‌ను రూ.30వేల ఇవ్వాలని డిమాండ్ చేసిన నవరత్న సేల్స్ ఆఫీసర్‌లు రాజేష్, క్రాంతిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఫౌండర్ ప్రెసిడెంట్ దినేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పెగడాపల్లి పెట్రోల్ బంక్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాల పెట్రోల్ బంక్‌ల ప్రొప్రైటర్లు పాల్గొని రెండు రోజుల్లో ఇద్దరు అధికారులపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఉద్యోగం నుంచి తొలగించకుంటే అన్ని బంక్‌లు బంద్ చేస్తామని డిమాండ్ చేశారు. ఈ నెల 20నాడు ఉదయం 10గంటల సమయంలో పెగడాపల్లి రోడ్డు ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌కు చెకింగ్‌కు వచ్చిన స్టేట్ ఆఫీసర్‌లు క్షుణ్ణంగా పరిశీలించిలో ఆన్‌లైన్‌లో డెన్సిటీ రికార్డు చేసిన మ్యాన్‌వల్‌గా చేయలేదని టార్గెట్ చేసి బంక్ సీజ్ చేశారన్నారు. పెట్రోల్ బంక్ సీజ్ చేయడం సరికాదని అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో పెట్రోల్ బంక్ నిర్వాహకులు ప్రతాప్ గుప్తా, శశిభూషణ్, వెంకటరమణ, జియాఖాన్, సలీం, విష్ణు, రాకేష్, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌ను తనిఖీ చేసిన రిజిస్ట్రార్



టీయూలో హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న రిజిస్ట్రార్ యాదగిరి

డిచ్‌పల్లి,జూలై 23:వర్సిటీలోని ఓల్డ్‌బాయ్స్ హాస్టల్‌ను రిజిస్ట్రార్ యా దగిరి మంగళవారం తనిఖీ చేశారు.పరిసరాలను పరిశీలించి వంట గదుల ను శుభ్రంగా ఉంచాలన్నారు. హాస్టల్ పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా, చెత్త చెదారం వేయకుండా చర్యలు తీసుకోవాలని, దోమల నివారనకు కిటికీ లకు జాలీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులకు ఉన్న సమ స్యలను విన్న రిజిస్ట్రార్ పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం రిజిస్ట్రార్, ఆడిట్‌సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్, ఇంజనీర్ వినోద్, ఎస్టేట్ ఆఫీసర్ అశోక్, విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈకార్యక్రమంలో టీకార్స్ క్రాంతి,దింగబర్, రమేశ్ పాల్గొన్నారు.

నేడు కమ్మర్‌పల్లిలో దివ్యాంగులకు బస్‌పాస్‌ల జారీ

కమ్మర్‌పల్లి, జూలై 23: మండంలోని వివిధ గ్రామాలలోని దివ్యాంగులకు బుధవారం కమ్మర్‌పల్లి ఐకేపీ కార్యాలయంలో ఆర్టీసీ బస్సుపాస్‌లు జారీ చేయబడతాయని ఏపీఎం కుంటగంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.దివ్యాంగులు బస్‌పాస్‌కోసం ఆర్మూర్ డిపోకు వెళ్లకుండా వారిసౌకర్యార్థ ఆర్మూర్ డిపో మేనేజర్ సహకారంతో ఐకేపీ కార్యాలయంలోనే ఆర్టీసీ సిబ్బంది అర్హులైన విద్యాంగులకు బస్‌పాస్‌లు జారీ చేస్తారని తెలిపారు.ఉదయం 10.30 గంటలకు దివ్యాంగులు వారియొక్క పాతబస్‌పాస్, సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలతో పాటు 4పాస్ పాస్‌షోటోలు తీసుకుని రావా ల్సిందిగా కోరారు. దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

డిగ్రీ వన్‌టైం పరీక్షల్లో ఒకరి గైర్హాజరు

డిచ్‌పల్లి,జూలై 23: తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ బ్యాక్‌లాగ్ వన్‌టైం పరీక్షలు మంగవారం 21వరోజు ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ తెలిపారు.అనుబంధ కళాశాల పరిధిలో ఉదయం జరిగిన పరీక్షకు 48 విద్యార్థులకు గాను 47 హాజరయ్యారని, ఒక విద్యార్థి గైర్హాజరు కాగా, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు ముగ్గురు విద్యార్థులకు గాను ముగ్గురు పరీక్షకు హాజరయ్యారని,ఆయన తెలిపారు.

కోటగిరి ఎంపీవోకు ఘనంగా వీడ్కోలు



ఎంపీవోను సన్మానిస్తున్న దృశ్యం

కోటగిరి,జూలై23:కోటగిరి ఎంపీవో మారుతీనిమండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఎంపీవో మారుతీ వర్ని మండలానికి బదిలీ కాగా మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీవోను ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమేనని ఎంపీడీవో మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో గంగాధర్, మండల పరిషత్ అధికారులు విఠల్, శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాణిజ్య శాస్త్రంలో కామర్స్ విద్యార్థుల ప్రతిభ



టీయూ వాణిజ్యశాస్త్రంలో రాష్ట్ర స్థాయి ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

డిచ్‌పల్లి,జూలై 23: రాష్ట్ర స్థాయి వాణిజ్య శాస్త్రంలో కామర్స్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కామర్స్ విభాగం ఓయూలో రాష్ట్ర స్థాయిలో ఎంకాం విద్యార్థులకు ప్రతీ ఏటా నిర్వహించే సదస్సు 19,20వ తేదీల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో టీయూ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. సోలో డ్యాన్స్‌లో గంగోత్రి మొదటి బహుమతి పొందగా, గ్రూప్ డ్యాన్స్‌లో రాము బృందం ద్వితీయ బహుమతి సాధించారు. వ్యాపార ప్రణాళిక తయారీలో గోపాల్, హర్షవర్ధన్, ప్రత్యేక బహుమతితో పాటు కేస్ స్టడీస్‌లో ద్వితీయ బహుమతి సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను రిజిస్ట్రార్ అభినందించారు. విద్యార్థులను ప్రోత్సహించిన కామార్స్ విభాగాధిపతి రాంబాబును ప్రత్యేకంగా అభినందించారు. ఈకార్యక్రమంలో విభాగ అధ్యాపకులు డా.శ్రీనివాస్, గంగాధర్, రేఖ, రాజు, పాల్గొన్నారు.

ఇంటర్ కళాశాలలోనే డిగ్రీ తరగతులు

● పక్కా భవనం లేని డిగ్రీ కళాశాల ● జూనియర్ కళాశాలలోనే డిగ్రీ కళాశాల తరగతులు ● ఇబ్బందుల్లో విద్యార్థులు



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న డిగ్రీ కళాశాల భవనం ఇదే



డిచ్‌పల్లిలో డిగ్రీ కళాశాల తరగతి గదులు

డిచ్‌పల్లి, జూలై 23: డిచ్‌పల్లి మండల కేంద్రంలో గత కొన్నేళ్లుగా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలనే డిమాండ్ దృష్ట్యా గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీశాసన సభ్యులు ప్రత్యేక చొరవ చూపి డిచ్‌పల్లి మండల కేంద్రానికి డిగ్రీ కళాశాల మంజూరు చేయించారు. కానీ భవనానికి నిధుల మంజూరు కాకపోవడంతో ప్రస్తుతం ఉన్న జూనియర్ కళాశాలలోనే డిగ్రీ తరగతులు నిర్వహిస్తున్నారు. డిగ్రీ కళాశాల కోసం కొన్ని తరగతి గదులను కేటాయించారు. ఇరుకుగా మారిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే డిగ్రీ తరగతి గదులు ఏర్పాటు చేయడంతో విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు పడతున్నారు. సరైన మౌలిక సదుపాయాలు లేక క్రీడామైదానం లాంటి సౌకర్యాలు విద్యార్థులకు అందని ద్రాక్ష గానే మారిపోయింది.2023-24 విద్యాసంవత్సరంలో ప్రారంభమై డిగ్రీకళాశాల డిచ్‌పల్లి జూనియర్ కళాశాల భవనంలో తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. డిగ్రీ కళాశాలనిర్మాణానికి స్థలాన్ని ఎంపిక చేయడంలో అధికారులు,నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంలో ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని అపవాదు వినబడుతుంది. 2023-24 విద్యా సంవత్సరంలో డిగ్రీలో బీఏ,బీకాం, బీఎస్సీ, బీజడ్సీ కోర్సులతో ప్రారంభించారు. ఈ విద్యాసంవత్సరంలో అన్ని కోర్సుల్లో కలిపి 30మంది నూతనంగా ప్రవేశం పొందారు. విద్యార్థులకు బోధన చెప్పేందుకు అధ్యాపకుల కొరత సైతం ఇక్కడ తీవ్రంగా వేధిస్తుంది. స్థానిక ఎమ్మెల్యే భూపతిరెడ్డి వెంటనే స్పందించి డిచ్‌పల్లి ప్రభుత్వ డిగ్రీకళాశాలకు నూతన భవనానికి నిధులు మంజూరు చేయాలని, అధ్యాపకులను కేటాయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ డిగ్రీ కళాశాల ద్వారా డిచ్‌పల్లి మండలంతో పాటు ఇందల్వాయి,మోపాల్,జక్రాన్‌పల్లి మండలాలకు విద్యార్థులకుసౌకర్యంగా మారనుంది. కావున డిగ్రీ కళాశాలకు సొంత భవనం ఏర్పాటే చేయాలని కోరుతున్నారు.ప్రస్తుతం కొనసాగుతున్న జూనియర్ కళాశాల భవనం ఎదుట కనీసం డిగ్రీ కళాశాల పేరుతో బోర్డుసైతంలేక పోవడం గమనార్హం.డిచ్‌పల్లి డిగ్రీ కళాశాలతో పాటు రాష్ట్రంలో మం జూరైన ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ డిగ్రీకళాశాల వంటి వాటికి ప్రభుత్వం అధ్యాపకులను కేటాయించిన,ఇక్కడి కళాశాలపై మాత్రం నిర్లక్ష్యం చూపి అధ్యాపకులను నియమించలేదు.దీంతో విద్యార్థులకు డిగ్రీ విద్య దూరం అవుతుందని విద్యార్థులు,వారితల్లిదండ్రులు వాపోతున్నారు.

విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనాలు అందించాలి

● అదనపు కలెక్టర్ అంకిత్

కమ్మర్‌పల్లి, జూలై 23: విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం రుచి, సూచి శుభ్రతతోకూడిన భోజనాలు అందించాలని అదనపు కలెక్టర్ అంకిత్ అన్నారు. మంగళవారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ, గిరిజన బాలిక విద్యాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటగదిని పరిశీలించి విద్యార్థుల కోసం వండిన భోజనాలను పరిశీలించారు. విద్యార్థులకు అందించే భోజనాలు వేడిగా ఉండే విధంగా చూడాలని నిర్వాహకులకు ఆదేశించారు. అనంతరం పాఠశాల పరిసరాలను పరిశీలించి తరగతగదులలో విద్యార్థులతో మాట్లాడుతూ..విద్యాపరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ప్రణాళికబద్ధం చదివితే లక్ష్యాలను చేరుకోవడం ఏమంత కష్టం కాదని సూచించారు. మంచి విద్యబోధించాలని ఇన్‌చార్జి ఎస్‌వో పద్మ, ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం మండల పరిషత్‌కార్యాలయంలో కొనసాగుతున్న ప్రజాపాలన కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. తప్పులు దొర్లకుండా లబ్ధిదారుల వివరాలు నమోదుచేయాలని సూచించారు. కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. గ్రామశివారులోని పల్లె ప్రకృతివనాన్ని పరిశీలించారు.



కేజీబీవీలో వంటగదని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్

నాగాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీరాంసాగర్ వరద కాలువ గట్టుపై కొనసాగుతున్న వనమహోత్సవ కార్యక్రమాన్ని పరిశీలించారు. నాగాపూర్ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులను అదనపు కలెక్టర్ అంకాత్ పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో రాజా శ్రీనివాస్, తహసీల్దార్ అంజనేయులు, ఏపీవో విద్యానంద్, ఏఈ పీఆర్ గట్ల శ్రీనివాసులు, పంచాయితి కార్యదర్శులు శాంతికుమార్, కాందేష్ సంధ్య, ఈజీఎస్ టీఏలు, పంచాయితి సిబ్బంది ఉన్నారు.

వర్సిటీ సమస్యలు పరిష్కరించాలని పరిపాలన భవనం ముట్టడి

● ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థుల ర్యాలీ



సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం



పరిపాలన భవనంలో ధర్నా చేస్తున్న విద్యార్థులు

డిచ్‌పల్లి,జూలై 23:తెలంగాణ విశ్వవిద్యాలయానికి ప్రభుత్వం రెగ్యులర్ వీసీ నియమించాలని, వర్సిటీ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌తో కళాశాల నుంచి మెయిన్ గేట్ వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం పరిపాలన భవనం మూకుమ్మడిగా విద్యార్థులు ముట్టడించి ఆందోళన చేశారు. తెలంగాణ వర్సిటీ సమస్యలు రెగ్యులర్ వీసీ లేకా సమస్యలు పరిష్కరం కావడం లేదని, ఇన్‌చార్జి వీసీ సమస్యలు ఎక్కడిక్కడే ఉండిపోతున్నాయని టీయూ రిజిస్ట్రార్ యాదగిరి విద్యార్థులు ఏసమ స్యల పరిష్కారానికి వెళ్లిన తన పరిధిలో లేదని తప్పించుకుంటున్నరని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు శివ విమర్శించారు. వర్సిటీలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేయా లని నూతన బాలికల హాస్టల్ నిర్మించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజురియింబర్స్ మెంట్ విడుదల చేయాలన్నారు.సెంట్రల్ లైబ్రెరీలో పోటీ పరీక్షలకు అన్ని రకాల పుస్త కాలను అం దుబాటులో ఉంచాలని విద్యార్థులకు ప్లెస్ మెంట్ సౌకర్యం కల్పించాలని, డిమాండ్ చేశా రు.నూతన ఆడిటోరియం నిర్మించాలని అన్నారు. విద్యార్థులకు 24గంటల వైద్యసదుపాయం ఉం డేలా చూడాలని, నూతన అంబులెన్స్ ఏర్పా టు చేయలన్నారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రం రిజిస్ట్రార్ యాదగిరికి అందజేశారు. ఈకార్యక్రమంలో ఏబీవీపీనాయకులు సాయి కు మార్, అవ్వుత్‌చారి,రాకేశ్,న వీన్,హ రినాథ్,సమీర్, హరికృష్ణ,మోహన్,అక్షయ్,లెనిన్, పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న రిజిస్ట్రార్

హెడ్ కుక్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నవీపేట,జూలై23: మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలోని బాలికల హాస్టల్‌లో హెడ్ కుక్‌గా పని చేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంఈవో గణేష్‌రావు తెలిపారు. దరఖాస్తుదారురాలు 10వ తరగతి పాసై ఉండాలని, 18సంవత్సరాల నుంచి 45సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలని, ఆసక్తి గల మహిళలు ఈ నెల 27లోగా మోడల్ పాఠశాల హాస్టల్‌లో తమ దరఖాస్తులు అందజేయాలని కోరారు.

అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమంపై అవగాహన

రెంజల్,జూలై23: రెంజల్ మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీలారాణి ఆధ్వర్యంలో అమ్మమాట అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమంపై పిల్లలకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. స్కూల్లోకి వచ్చే పిల్లలకు పౌష్టికాహారం, సమగ్ర అభివృద్ధి అందే తీరును తల్లిదండ్రులకు వివరించారు. గర్భిణులు, చిన్న పిల్లలకు పోషకాహారం అందించి ఆరు నెలల వరకు పిల్లలకు తల్లిపాలు అందించాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సీసీ శ్యామల, సీఏలు, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు సురేఖ, సుజాత, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నేడు పొతంగల్‌లో ఇసుక వేలం

కోటగిరి,జూలై23: పొతంగల్ మండలంలోని హంగర్గ బైపాస్ సమీపంలో సీజ్ చేసిన ఇసుక డంప్‌కు బుధవారం వేలంపాట నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. సుమారు 12ట్రాక్టర్ల ఇసుక ఉండడంతో వేలంలో పాల్గొనే వారు 3వేలు డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనాలని సూచించారు.



పొతంగల్‌లో డంప్ చేసిన ఇసుక

నేరాలు, చట్టాలపై విద్యార్థులకు అవగాహన



కోటగిరి జూనియర్ కళాశాలలో మాట్లాడుతున్న ఎస్ఐ సందీప్

కోటగిరి,జూలై23: యువత గంజాయి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోటగిరి ఎస్ఐ సందీప్ సూచించారు. కోటగిరి జూనియర్ కళాశాలలో మంగళవారం పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చక్కని నాటిక పాటలతో అవగాహన కల్పించారు. వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని తద్వారా గ్రామాలు సురక్షితంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల జూనియర్ కళాశాలలో వన మహోత్సవం



బాలికల జూనియర్ కళాశాలలో మొక్కలు నాటుతున్న ఏసీపీ బస్వారెడ్డి

ఆర్మూర్‌రూరల్,జూలై23: ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ జస్టిస్ మూమెంట్ ఆధ్వర్యంలో మంగళవారం వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ బస్వారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని, మానవళి మనుగడకు చెట్లే ఆధారమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైరపర్సన్ వన్నెల్‌దేవి లావణ్య శ్రీనివాస్, రూరల్ సీఐ శ్రీధర్, ట్రాఫిక్ సీఐ ఓడి.రమేష్, మున్సిపల్ కమిషనర్ రాజు, వైసచైర్మన్ షేక మున్న, కళాశాల ప్రిన్సిపాల్ దేవరాం, వన మహోత్సవ ఇన్‌చార్జీ వెంకటేష్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలి : ఎక్సైజ్ సీఐ



డొంకేశ్వర్‌లో మొక్కలు నాటుతున్న ఎక్సైజ్ సీఐ దిలీప్

డొంకేశ్వర్, జూలై23: నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని ఎక్సైజ్ సీఐ దిలీప్ అన్నారు.వనమహోత్సవంలో భాగంగా మంగళవారం డొంకేశ్వర్ మండల కేంద్రంలోని కోమటి చెరువు కట్ట నుంచి డొంకేశ్వర లిఫ్టు కెనాల కట్ట వరకు రెండు వేల మొక్కలను నాటారు. నాటిన ప్రతి మొక్కను రక్షించే బాధ్యత తీసుకోవాలనిగౌడసంఘం సభ్యులకు సూచించారు.ఈతమొక్కల యొక్క ప్రాముఖ్యతను ఎక్సైజ్ శాఖ అధికారులు వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో గౌడసంఘం సభ్యులు రామాగౌడ్,గంగాగౌడ్, భూమాగౌడ్, సుధాగౌడ్,గణేష్‌గౌడ్,మహేందర్‌గౌడ్,సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత

డొంకేశ్వర్, జూలై23: డొంకేశ్వర్ మండలం మారంపల్లి గ్రామానికి చెందిన అర్రై చంద్ర గత నెల రోజులుగా బ్రెయిన్‌లో రక్తం గడకట్టి నరాల సంబంధించిన వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నవ్యక్తికిరూ.2లక్షల 50వేల ఎల్‌వోసీని మంజూరు చే యించారు. బాధిత కుటుంబం ఆర్థిక స్తోమత గురించి గ్రామ కాంగ్రెస్ నాయకులు బండి గం గాధర్, తలారి రాజన్న, మల్లేష్ గౌడ్‌లు ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌కుమార్‌రెడ్డికి వివరించగానే చికిత్స నిమిత్తం రూ.2లక్షల 50వేల ఎల్‌వోసీని మంజూరు చేయించారు. ఈ మేరకు బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ కాపీని అందజేశారు.



బాధిత కుటుంబానికి ఎల్‌వోసీని అందజేస్తున్న దృశ్యం

పలు చోట్ల ఘనంగా బోనాల పండుగ



కల్దుర్కిలో బోనాల పండుగ దృశ్యం



బొప్పాపూర్‌లో బోనాల పండుగను నిర్వహిస్తున్న గ్రామస్థులు

బోధన్‌రూరల్,జూలై23: మండలంలోని కల్దుర్కి గ్రామంలో మంగళవారం గ్రామస్థులు బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంటి నుండి బోనాలతో ప్రధాన వీధులగుండా అమ్మవారి ఆలయానికి డప్పువాయిద్యాల మధ్య చేరుకున్నారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలని, పాడిపంట చల్లగా ఉండాలని, వర్షాలు సకాలంలో కురువాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వీడీసీ ఛైర్మన్ గంగాధర్, మాజీ సర్పంచ్ నానా పటేల్, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ లక్ష్మి రాజన్న, గ్రామపెద్దలు తుడుం బాబు, మొగులయ్య, హన్మంత్‌రెడ్డి,లక్ష్మణ్, ధర్మయ్య, బాలు, శివ, గంగాధర్, అశోక్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

● బొప్పాపూర్‌లో బోనాల పండుగ

రుద్రూరు: రుద్రూరు మండలంలోని బొప్పాపూర్ గ్రామం లో భక్తి శ్రద్ధలతో మంగళవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహిం చారు. బోనాలతో మహిళలు డప్పు చప్పుళ్ళ మధ్య కన్నుల పండుగ ఊరేగింపు నిర్వహించి గ్రామ దేవతలకు నైవేద్యాలను సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ వర్షాలు బాగా కురవాలని, పాడి పంటలు వృద్ధి చెందాలని గ్రామం బాగుండాలని, కుటుంబాలు చల్లగా ఉండాలని పిల్లాపాపలు ఎటువంటి అనారోగ్యం బారిన పడకుండా కాపాడాలంటూ అమ్మవార్లను వేడుకున్నారు. ఈ బోనాల వేడుకల్లో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పట్ల సురేష్, మాజీ జడ్పీటీసీ నారోజీ గంగారాం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



హంగర్గలో బోనాల పండుగ దృశ్యం

కోటగిరి: పొతంగల్ మండలంలోని హంగర్గ గ్రామంలో మంగళవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో బోనాలను డప్పువాయిద్యాలతో ఊరేగించారు. గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయ్ పటేల్, గంగాధర్, ప్రకాష్ పటేల్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండల కేంద్రంలో మంగళవారం ఆరె కటికె సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు తలపై బోనాలను ఎత్తుకుని గ్రామ దేవతల ఆలయాలకు తరలివెళ్లారు. పాడిపంటలు చల్లగా ఉండాలని కోరుతూ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆరె కటికె సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పేకాట ఆడితే కఠిన చర్యలు

బోధన్‌రూరల్,జూలై23: పేకాట ఆడిన, పేకాట నిర్వహించిన కఠిన చర్యలు తప్పవని బోధన్ రూరల్ ఎస్ఐ నాగనాథ్ తెలిపారు. మంగళవారం మండలంలోని సాలూర క్యాంప్ గ్రామంలో పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 1200 స్వాధీనం చేసుకున్నామన్నారు. పేకాట ఆడి తమ జీవితాలు నాశనం చేసుకోవద్దని, పేకాటకు బానిసలు కావొద్దని ఆయన అన్నారు. గ్రామాలలో పేకాట స్థావరాల ఆచూకీని పోలీసులకు సమాచారం అందించాలని వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

స్వగ్రామానికి చేరిన వినోద్ మృతదేహం

మెండోరరూరల్, జూలై 23: మండల కేం ద్రానికి చెందిన మాకురి వి నోద్ బెహరాన్ దేశంలో గురువారం మృతి చెందడంతో మృత దేహం మంగళవారం మెండోరకు చేరుకుంది. వినోద్ మృత దేహం చూడగానే మృతుడి కుంటుంబ సభ్యులు బంధువులు గుండెలు పగిలేలా రోదించారు. బెహరాన్‌లో వినోద్ మృతి చెందిన విషయం రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సం స్థ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్, కోటపాటి నర్సింహనాయుడు దృష్టికి తీసుకెళ్లగానే ప్రత్యేక చొరవ తీసుకొని బెహరన్ దేశంలో ఉన్న తెలుగు కళాసమితి సంక్షేమ విభాగం కన్వీనర్ నోములు మురళి, మాకురి గంగాధర్‌ల సహకారాలతో ఈరవత్రి అనిల్ ఎప్పటి కప్పుడు మా ట్లాడుతూ ఐదురోజుల వ్యవధిలోనే మృతుడి మృతదేహం స్వగ్రా మా నికి చేరుకోవడం జరిగింది. మృతుడి అంత్యక్రియలకు ఈరవత్రి అనిల్ రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కోటగిరి ఎంపీవోగా చందర్

కోటగిరి,జూలై23: కోటగిరి ఎంపీవోగా చందర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. వర్ని మండలం నుండి బదిలీపై ఆయన కోటగిరికి వచ్చారు. కోటగిరి ఎంపీవోగా పని చేసిన మారుతీ వర్ని మండలానికి బదిలీ అయిన విషయం తెలిసిందే.

ఇంటిగ్రేటెడ్ పీజీ సెమిస్టర్ పరీక్షల్లో 11మంది గైర్హాజరు

డిచ్‌పల్లి,జూలై 23: విశ్వవిద్యాలయం పరిధిలోని పీజీ ఇంటిగ్రేటెడ్ ఏపీఈ, ఐపీసీహెచ్,ఐఎంబీఏ 6,8,10వ సెమిస్టర్, ఎల్‌ఎల్‌బీ 6, ఎంబీఏ, ఎంసీఏ 1,3వ సెమిస్టర్, ఐఎంబీఏ 7,9 వసెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లగ్ పరీక్షలు మంగళవారం 7వరోజు ప్రశాంతంగా జరిగాయని ఆడిట్‌సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ తెలిపారు. ఆర్ట్సకళాశాల, న్యాయ కళాశాలలో జరిగిన పరీక్షల్లో71 మంది విద్యార్థులకుగాను 71 మంది పరీక్షకు హాజరయ్యారని ఆడిట్‌సెల్ డైరెక్టర్ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 159మంది విద్యా ర్థులకు 148 విద్యార్థులు హాజరయ్యారని, 11మంది గైర్హాజరయ్యా రని డైరెక్టర్ పేర్కొన్నారు.



అంగన్‌వాడీ సెంటర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

విద్యార్థుల పట్ల అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలు

● మండల ప్రత్యేక అధికారి దయానంద్

నసురుల్లాబాద్, జూలై23: పాఠశాలలో విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సెంటర్‌లోని అంగన్‌వాడీ టీచర్లు విద్యార్థుల పట్ల అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలు తప్పవని మండల ప్రత్యేకఅధికారి దయానంద్ అన్నారు. మంగళవారం నసురుల్లాబాద్ మండలంలోని బొమ్మన్‌దేవ్‌పల్లి ప్రాథమిక పాఠశాలను, అదేవిధంగా గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీచేశారు. అంగన్‌వాడీ సెంటర్‌లో విద్యార్థులు లేకపోవడంతో విద్యార్థులు సెంటర్‌కు ఎందుకు రాలేదని అంగన్‌వాడీ టీచర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సెంటర్‌లోని రిజిష్టర్‌లను పరిశీలించారు. విద్యార్థులు, గర్భిణులు, బాలింతలు సెంటర్‌కు తప్పకుండా వచ్చేలా చూడాలని అంగన్‌వాడీ టీచర్‌ను ఆదేశించారు. అదే విధంగా గర్భిణీలకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందజేయాలన్నారు. అనంతరం మండల అభివృద్ధి కార్యాలయ ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలను నాటారు. మండల ప్రత్యేకాధికారి వెంట ఎంపీవో సూర్యకాంత్, ఉపాధిహామీ ఏపీవో సౌజన్య తదితరులు ఉన్నారు.

7.5 అడుగులకు పోచారం ప్రాజెక్టు నీటిమట్టం

నాగిరెడ్డిపేట, జూలై 23: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పోచారం ప్రాజెక్టులోకి వరద నీరువచ్చి చేరుతోంది. పోచారం ప్రాజెక్టు ఎగువ ప్రాంతమైన మంచిప్ప అడవుల్లో లింగంపేట, గాంధారి, తాడ్వాయి, రాజంపేట తదితర మండలాల్లో కురిసిన భారీవర్షాల కారణంగా లింగంపేట, గుండారం వాగుల ద్వారా ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతుంది. మంగళవారం సాయంత్రానికి ప్రాజెక్టులో 7.5 అడుగుల నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 1.820 టీఎంసీలకు గాను ప్రస్తుతం 0.324 టీఎంసీల నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టులోకి మంగళవారం సాయంత్రానికి ఇన్‌ఫ్లో 126 క్యూసెకులకు తగ్గిందని ఎల్లారెడ్డి నీటి పారుదల శాఖ డీఈ వెంకటేశ్వర్లు తెలిపారు.

తెగుళ్ల నివారణకు తగిన చర్యలు చేపట్టాలి

పెద్దకొడప్‌గల్, జూలై23: మండలకేంద్రంలోని రైతువేదికలో మంగళవారం రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాస్త్రవేత్తలతో మండల వ్యవసాయాధికారులు, రైతులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదిలాబాద్ జిల్లా ప్రధాన శాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోధన విభాగం అధిపతి రాంప్రసాద్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో ఆరుతడి పంట కింద రైతన్నలు ప్రధానంగా పత్తి పంటను సాగుచేస్తారని తెలిపారు. పత్తి పంటకు పేనుబంక, పచ్చదోమ, తామర పురుగు, పొగాకు లద్దెపురుగు, గులాబీ రంగులో కాయతొలచు పురుగు వ్యాప్తివంటి తెగుళ్లు వస్తాయని వీటికి నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. తెగుళ్ళ నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నదీమ్ ఉద్దీన్, ఏఈవోలు రూప, సునంద, రైతులు పాల్గొన్నారు.

ఓటీపీ నెంబర్లు ఎవరికీ చెప్పొద్దు

పెద్దకొడప్‌గల్, జూలై23: తమ ఫోన్‌కు వస్తున్న ఓటీపీ నెంబర్లను ఎవరికీ చెప్పొద్దని పోలీసులు ప్రజలకు సూచించారు. మండల కేంద్రంలోని బ్యాంకు ఆవరణలో సైబర్ నేరాలపై ప్రజలకు పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు రోజుకూ కొత్త పద్ధతుల్లో మోసం చేస్తున్నారని, ఎవరైనా బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని తెలిపినా, ఓటీపీ నెంబర్లను అడిగినా చెప్పొద్దని సూచించారు. ఒకవేళ ఎవరైనా సైబర్ మోసానికి గురైతే 1930 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది వెంకటేష్, సాయిశివ, అంజి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో బోనాల పండుగ

నసురుల్లాబాద్, జూలై23: మండలంలోని నెమలి శ్రీవాణి స్కూల్‌లో బొరడి పోచమ్మకు బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు బోనాలు ఎత్తుకుని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింహారెడ్డి, స్వామి, గణేష్ పాల్గొన్నారు.

గృహహింస, వరకట్నం కేసు నమోదు

ఎల్లారెడ్డి, జూలై23: అదనపు కట్నం తేవాలని వేధిస్తున్న భర్త, అత్తమామపై గృహహింస వరకట్నం కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డి ఎస్సై మహేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డి మండలంలోని లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్‌కు బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన కృష్ణవేణితోగత 3నెలల క్రితం వివాహమైందని, వివాహం జరిగినప్పటి నుంచి అదనపు కట్నం తీసుకురావాలని ప్రతీరోజు ఇంట్లో గొడవ పడుతూ తిడుతూ కొడుతూ వేధిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడినా, పోలీస్‌స్టేషన్‌లో కౌన్సిలింగ్ ఇచ్చినా శ్రీకాంత్‌లో మార్పు రాకపోవడంతో కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మృతుడి కుటుంబానికి నిత్యావసర సరుకుల అందజేత

భిక్కనూరు, జూలై 23: ఇటీవల మృతిచెందిన అవయవదాత మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రా మానికి చెందిన మెట్టు ప్రవీణ్ కుటుంబానికి మంగళవారం పెద్దమల్లారెడ్డి వాసవీక్లబ్ ఆధ్వర్యంలో సభ్యులు నెలకు సరిపడా నిత్యావసరాల సరుకులను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు అల్లాడి సుదర్శన్, సభ్యులు పాల్గొన్నారు. అలాగే మృతుడు ప్రవీన్‌కుటుంబానికి గ్రామానికి చెందిన కానిస్టేబుళ్లు పంగ ఎల్లారెడ్డి, పెంజర్ల శ్రావణిరెడ్డి, బండి రంజిత్‌గౌడ్ మంగళవారం రూ.4వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో గొల్పర్తి రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక బస్సులు వేయాలని విద్యార్థుల ధర్నా



బస్సులకు అడ్డంగా బ్యాగులు పెట్టి నిరసన తెలుపుతున్న విద్యార్థులు



కామారెడ్డి బస్టాండ్ వద్ద ఏబీవీపీ నాయకులు..

కామారెడ్డి టౌన్, జూలై 23: కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డికి బస్సులు సరిగ్గా రావడం లేదని, వచ్చినా బస్సు నిండా జనం ఉండడంతో అందులో ఎక్కలేక, కాలేజీకి సమయానికి వెళ్లలేక అవస్థలు పడుతున్నామని విద్యార్థులు మంగళవారం ఆందోళనకు దిగారు. ప్రత్యేక బస్సులు వేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆందోళనకు ఏబీవీపీ నాయకులు మద్దతు తెలిపి అక్కడి నుంచి కామారెడ్డి డిపో మేనేజర్ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నాచేశారు. చిన్నమల్లారెడ్డిలో 60కి పైగా విద్యార్థులకు బస్సు సదుపాయం సరిగ్గా లేక కళాశాలకు సమయానికి వెళ్లలేకపోతున్నామని, బస్సుల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండడంతో బస్సులో ఎక్కలేక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సైకిళ్లు, కాలినడకన వస్తుండడంతో కళాశాలకు సమయానికి చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. స్పందించిన డిపో మేనేజర్ ఇందిరా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు రోహిత్, ఖలీల్, అల్తాఫ్, నవీన్, అక్షయ తదితరులు పాల్గొన్నారు.

'మహిళల అభివృద్ధికి చేయూతనిస్తాం'

పెద్దకొడప్‌గల్, జూలై 23: జుక్కల్ మండలంలో ఉన్న మహిళా సంఘ సభ్యుల అభివృద్ధికి చేయూతనందిస్తామని జుక్కల్ ఎస్‌బీఐ మేనేజర్ కార్తీక్ గౌడ్ తెలిపారు. మంగళవారం జుక్కల్ ఐకేపీ కార్యాలయంలో మహిళా సంఘ సభ్యులకు నాబార్డు ఆధ్వర్యంలో నిర్వహించిన మగ్గంవర్క్ శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మేనేజర్ కార్తీక్‌గౌడ్ మాట్లాడుతు మహిళా సంఘాలకు స్వయం ఉపాధి కింద రుణాలు ఇస్తున్నామని, దీంతోపాటుగానే కొత్త కోర్సులలో శిక్షణ పొందిన మహిళలకు రుణాలు ఇస్తామని తెలిపారు, రుణం తీసుకున్న మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే సంఘానికి మంచి పేరు వస్తుందని తెలిపారు. మగ్గంవర్క్‌లలో శిక్షణ పొందిన మహిళలకు బ్యాంకు తరపున రుణాలు అందజేస్తామని తెలిపారు. అనంతరం ఏపీఎం సత్యనారాయణ మాట్లాడుతూ గతంలోనే జుక్కల్ మహిళా సంఘాలకు చెందిన సభ్యులకు గతంలోనే నాబార్డు ఆధ్వర్యంలో మగ్గంవర్క్‌పై 20రోజుల శిక్షణ ఇప్పించామని, తిరిగి పునశ్చరణ కార్యక్రమంలో భాగంగా రెండురోజుల శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలలో నాబార్డు కోఆర్డినేటర్ గోపినాథ్‌రెడ్డి, సీసీలు తుకారాం, సాయిలు, మహేష్ గౌడ్, రాజశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

నసురుల్లాబాద్, జూలై 23: నసురుల్లాబాద్ మండలం మైలారం గ్రామ శివారులో గల కొచ్చెరి మైసమ్మ ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు కాకుండా వివిధ మండలాల భక్తులు వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

భిక్కనూరు, జూలై23: కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని భిక్కనూరు మండల వ్యవసాయాధికారిణీ రాధ కోరారు. జూన్ 28లోపు కొత్త పట్టాదారు పాసుపుస్తకం వచ్చి ఇంతవరకు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోని రైతులు ఆగస్టు 5లోపు దరఖాస్తు చేసుకోవాలని, అందుకు దరఖాస్తుతో పాటుగా పట్టాదారు పాసుపుస్తకం లేదా తహసీల్దార్‌తో డిజిటల్ సంతకమైన డీఎస్ పేపర్, ఆధార్‌కార్డు, నామిని ఆధార్‌కార్డును జతచేసి ఏఈవోలకు అందజేయాలన్నారు.

విద్యుత్‌షాక్‌తో ఒకరి మృతి

దోమకొండ, జూలై23: విద్యుత్‌షాక్‌తో ఓ వ్యక్తి మృతిచెందినట్లు ఏఎస్సై సుబ్రహ్మణ్యచారి మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. దోమకొండ గ్రామానికి చెందిన పిట్ల రాజయ్య(65) పులబోయిన శంకర్ అనే మేస్త్రీ వద్ద కూలి పని చేస్తున్నాడు. అయితే దోమకొండలో కూలి నిమిత్తం నల్లపు శ్రీనివాస్ నూతన గృహనిర్మాణ పనికివెళ్లాడు. ఇంట్లో ట్యూబ్ లైట్ పెడుతుండగా అక్కడ విద్యుత్ తీగలు తేలిఉండటంతో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తగిలింది. వెంటనే అతన్ని అనుపత్రికి తరలిస్తుండగా మార్గమాధ్యలో మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు శంకర్, శ్రీనివాస్‌లపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు. కాగా మృతుడి కుటుంబ సభ్యులకు న్యాయం జరిగేలా చూడాలని కులస్థులు గాంధీ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతుని కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని డీఎస్పీ నాగేశ్వర్‌రావు, సీఐ సంపత్ కుమార్ చెప్పడంతో కులస్థులు శాంతించారు.



దోమకొండలో రాస్తారోకో చేస్తున్న దృశ్యం

మున్సిపల్‌లో అధికారుల బదిలీలు

కామారెడ్డిటౌన్, జూలై 23: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన బదిలీల్లో భాగంగా మున్సిపల్‌లోని ఆయా విభాగాల అధికారులు బదిలీపై వెళ్లారు. శానిటేషన్ విభాగంలోని శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్ గజ్వేల్‌కు బదిలీ కాగా, ఇన్‌చార్జ్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ పర్వేజ్ ఎల్లారెడ్డికి బదిలీఅయ్యారు. టౌన్‌ప్లానింగ్ విభాగంలోని టీపీఎస్‌లు రాజేష్, అనుపలు నిజామాబాద్‌కు బదిలీ అయ్యారు. రెవెన్యూ విభాగంలోని ఆర్‌ఐ జానయ్య మెదక్‌కు బదిలీ అయ్యారు. అదేవిధంగా ఇతర జిల్లాల నుంచి, బాన్సువాడ, ఎల్లారెడ్డి నుంచి పలువురు అధికారులు కామారెడ్డికి బదిలీపై వచ్చారు.

'జీనియస్, ప్రెసిడెన్షియల్ పాఠశాలలకు అనుమతులు లేవు'

కామారెడ్డిటౌన్, జూలై23: కామారెడ్డి పట్టణంలోని జీనియస్, ప్రెసిడెన్షియల్ ప్రైవేట్ పాఠశాలలకు ఎలాంటి అనుమతులు లేవని ఎంఈవో ఎల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు లేని పాఠశాలలో విద్యార్థులను చేర్పించి తల్లిదండ్రులు ఇబ్బందులు పడవద్దని ఎంఈవో పేర్కొన్నారు.

'ప్రతీ దాబాలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి'

భిక్కనూరు, జూలై23: భిక్కనూరు మండల పరిధిలోని దాబాలలో తప్పకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని భిక్కనూరు సీఐ సంపత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం భిక్కనూరు ఎస్సై కార్యాలయంలో దాబాల యాజమానులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ దాబాలలో మద్యం సిట్టింగులు నిర్వహిస్తే కఠినచర్యలు తప్పవని, ప్రతీదాబా వద్ద లైటింగ్‌ను ఏర్పాటు చేసుకోవాలని, నోపార్కింగ్ ప్రదేశాల్లో, రోడ్డుపై వాహనాలను నిలపవద్దన్నారు. నిబంధనలు ఎవరైనా అతిక్రమిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఇందులో ఎస్సై సాయికుమార్, దాబాల యాజమానులున్నారు.

దోమకొండ ఎంపీవోగా ప్రవీణ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

దోమకొండ, జూలై23: దోమకొండ మండల పంచాయతీ అధికారిగా ప్రవీణ్ కుమార్ బాధ్యతలు తీసుకున్నారు. భిక్కనూరు ఎంపీవోగా పని చేసిన ఆయనను జిల్లా అధికారులు దోమకొండకు బదిలీ చేశారు. ఈ మేరకు ఆయన తన కార్యాలయంలో మంగళవారం బాధ్యతలు చెపట్టారు.అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

ధర్మసమాజ పార్టీ జిల్లా కన్వీనర్‌గా బోలేశ్వర్

కామారెడ్డిటౌన్, జూలై23: ధర్మ సమాజ పార్టీ జిల్లా కన్వీనర్‌గా ఉగ్రవాయి బోలేశ్వర్ నియామకమయ్యారు. మంగళవారం అందుకు సంబంధించిన నియామక పత్రాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, అరవింద్, రాజు,భూమయ్య, గంగారాజు, పర్శరాములు, సాయి తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు సర్కిల్ కార్యాలయం తనిఖీ

భిక్కనూరు, జూలై23: భిక్కనూరు సర్కిల్ కార్యాలయం, పోలీసుస్టేషన్‌ను ఎస్పీ సింధూశర్మ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్కిల్ కార్యాలయంలో, పోలీసుస్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని పోలీసుల పనితీరు బాగుందని, పోలీసుస్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల స్నేహపూర్వకంగా మెలగాలని, వచ్చిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలన్నారు. భిక్కనూరు సర్కిల్ పరిధిలో అసాంఘిక కార్యకలపాలపై ప్రత్యేక నిఘా పెట్టి ఉక్కుపాదం మోపాలని, గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, మాదకద్రవ్యాల విషయంలో ఎంతటివారైనా ఉపేక్షించొద్దని సూచించారు. అంతకుముందుగా ఎస్పీకి సర్కిల్ పోలీసులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో డీఎస్పీ నాగేశ్వర్‌రావు, భిక్కనూరు సీఐ సంపత్‌కుమార్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



భిక్కనూరు పోలీసుస్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ



బస్టాండ్ పరిసరాలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

బస్టాండ్‌ను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్

కామారెడ్డిటౌన్, జూలై23: కామారెడ్డి పట్టణంలోని కొత్తబస్టాండ్‌ను మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించారని అన్నారు. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచడంతోపాటు సరైన సమయంలో బస్సులు నడిపించాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని సూచించారు. బస్టాండ్‌లో మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యాలు కూడా ఏర్పాటుచేయాలని డిపో మేనేజర్‌కు ఇందిరాకు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, వార్డు కౌన్సిలర్ పాతశివ కృష్ణమూర్తి, చాట్ల వంశీ, సలీం, పంపరి శ్రీను, అనూష, ప్రసన్న, సుగుణ పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ



అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

మద్నూర్, జూలై23: మండలకేంద్రంలో బోనాల పండుగను ఆయా కులసంఘాలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జాము నుంచే ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బోనాలతో మహిళలు డప్పు చప్పుళ్ల మధ్య కన్నుల ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి బోనాలను సమర్పించారు. వర్షాలుబాగా కురవాలని పాడి పంటలు వృద్ధి చెందాలని, పిల్లాపాపలు ఆరోగ్యంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. ప్రతీ సంవత్సరం ఆషాడ మాసంలో అమ్మవారికి మొక్కులు తీర్చుకోవడానికి బోనాల పండుగలు జరుపుకోవడం అనవాయితీగా వస్తోంది. మండల కేంద్రం బోనాల ఊరేగింపుతో సందడిగా మారింది.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

పెద్దకొడప్‌గల్, జూలై 23: గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి కిషన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలకేంద్రంతోపాటు ఆయా గ్రామాలలో ఆయన పర్యటించారు. ముందుగా మండల కేంద్రంలో గల ప్రజాపాలన సేవా కేంద్రాన్ని పరిశీలించారు. ప్రజాపాలన సేవా కేంద్రం పనితీరును సిబ్బందికి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాస్లాబాద్ గ్రామ పంచాయితీలో రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండ నివారణ చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అక్కడి నుంచి గ్రామశివారులోగల బృహత్ పల్లెప్రకృతి వనం పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీవో సుదర్శన్, పంచాయతీ కార్యదర్శి జ్యోతి పాల్గొన్నారు.

మళ్లీ కూలిన సబ్‌ట్రెజరీ కార్యాలయ గది పైకప్పు



కూలిన గది పైకప్పు

మద్నూర్, జూలై 23: మండల కేంద్రంలోని సబ్‌ట్రెజరీ కార్యాలయ గది పైకప్పు మళ్లీ కూలింది. వర్షానికి రెండుసార్లు పైకప్పు కూలడంతో కంప్యూటర్లు పనిచేయకుండా వృథాగా పడిఉన్నాయి. కార్యాలయంలో పనులు చేయాలంటే సిబ్బంది భయబ్రాంతులకు గురవుతున్నారు. మంగళవారం కార్యాలయం ఆవరణలోనే కూర్చుని ఎస్‌టీవో తమ విధులను నిర్వహించారు. గత రెండేళ్ల క్రితం సబ్‌ట్రెజరీ కార్యాలయానికి ప్రభుత్వం 13లక్షల నిధులు విడుదల చేసింది. ఆ నిధులతో మరమ్మతులు చేపట్టినా పనులు నాసిరకంగా చేపట్టడంతో పరిస్థితి ఇలా ఉందని పలువురు విమర్శిస్తున్నారు. సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని మరో వద్దకు మార్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కూలుతున్న పురాతన ఇళ్లు

బీర్కూర్, జూలై 23: గత నాలుగు రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న పురాతన ఇళ్లు కూలుతున్నాయి. బీర్కూర్‌లో ఓ వ్యక్తికి చెందిన పెంకుటిల్లు వర్షాల ధాటికి కూలిపోయింది. బీర్కూర్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో పురాతన ఇళ్లు కూలుతున్నాయని, అయినా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాత్కాలిక శిబిరాలను ఏర్పాటు చేయాలని పేద ప్రజలు కోరుతున్నారు.



బీర్కూర్‌లో కూలిన పెంకుటిల్లు

పాత కక్షలతో గొర్రెల కాపరి దారుణ హత్య

● పూడ్చిన మృతదేహాన్ని వెలికితీసిన పోలీసులు



మృతదేహాన్ని పూడ్చిన స్థలంలో తవ్వకాలు చేస్తున్న దృశ్యం

సదాశివనగర్, జూలై 23 : పాత కక్షలతో హత్యకు గురైన ఓ గొర్రెల కాపరి మృతదేహాన్ని పోలీసులు వెలికితీశారు. సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డికి చెందిన జీర్ల చిన్నమల్లయ్య (55)ను అదేగ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు హత్య చేసి మల్లన్నగుట్ట ప్రాంతంలో పాతి పెట్టిన ఘటన మంగళవారం వెలుగు చూసింది. సదాశివనగర్ సీఐ సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం.. అడ్లూర్ ఎల్లారెడ్డికి చెందిన జీర్ల చిన్నమల్లయ్య గొర్రెలను కాస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. అయితే కొద్దిరోజుల నుంచి అతను కనిపించకుండా పోయాడు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ చేపట్టారు. అనుమానితుల్లో ఒకరైన సాయిలును అదుపులోకి తీసుకుని విచారించడంతో పాటు గ్రామంలోని పలు సీసీ కెమెరాలను పరిశీలించారు. విచారణలో అదే గ్రామానికి చెందిన జోగు బీరయ్య, దొండడి సుమన్ కలిసి మల్లయ్యను పాత కక్షలతో హత్య చేసి పూడ్చిపెట్టినట్లు ఒప్పుకున్నారు. దీంతో నిందితులను మంగళవారం మల్లన్నగుట్ట శివారు ప్రాంతంలో తీసుకెళ్లి పూడ్చినచోట తవ్వి చూడగా మల్లయ్య మృతదేహం బయటపడింది. అయితే మల్లయ్య కుమారుడు ప్రవీణ్ రెండు నెలల క్రితం గ్రామశివారులో ఆత్మహత్య చేసుకున్నాడు. కొడుకు ఆత్మహత్యకు జోగు బీరయ్య, దొండడి సుమన్‌లే కారణమని మల్లయ్య అనుమానంతో పలుమార్లు వారితో వాగ్వాదానికి దిగాడు. దీంతో మల్లయ్యపై కక్షపెంచుకున్న ఆ ఇద్దరూ మల్లయ్యను హత్య చేసినట్లు సీఐ వివరించారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి	- ఓసీ
దర్శన్	- డార్లింగ్
ప్రియా 70	- కల్కి
ప్రియా 70	- భారతీయుడు - 2

బాన్సువాడ

మహేశ్వర	- కల్కి
వెంకటేశ్వర	- డార్లింగ్

చికెన్ ధరలు



రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	170	220	230

